జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..
WWW.DASHANEWS.COM
బుధవారం 20 05 2026
సంపుటి 1 సంచిక 177
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
జ్వాల దశ నిజం.. నిర్భయంగా..
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న జ్వాల దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ. ఇన్చార్జులు | మండల రిపోర్టర్లు | క్రైమ్ రిపోర్టర్లు
7337 54 6647 (వాట్సాప్)



## మద్యం తాగించి స్టూడెంట్ పై రేప్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. తోటి విద్యార్థినిపై ఓ ఇంజినీరింగ్ విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. నమ్మి వెంట వెళ్లిన స్నేహితురాలికి మద్యం తాగించి, లైంగిక దాడి చేశాడు. బాధితురాలు ధైర్యం ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్ ఇబ్రహీంపట్నంలోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 14న

..మిగతా 4వ పేజీలో →



## పాలమూరు-రంగారెడ్డి యుద్ధ ప్రాతిపదికన

### త్వరితగతిన ఎత్తిపోతల భూ సేకరణ ప్రక్రియ: సీఎం రేవంత్‌రెడ్డి

**దశ, హైదరాబాద్:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు

..మిగతా 4వ పేజీలో →

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం..

### ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష

**దశ, హైదరాబాద్:** జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్,

..మిగతా 4వ పేజీలో →





### రేషన్ కార్డు కోసం వచ్చి..

### ఉద్యోగిని వలలో వేసుకుని

## హనీట్రాప్

### సుమారు రూ.6 లక్షలు వసూలు చేసిన కిలాడీ లేడీ

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ పంజాగుట్ట పరిధిలో ఒక ప్రభుత్వ ఉద్యోగిని వలలో వేసుకుని హనీట్రాప్ ద్వారా సుమారు రూ.6 లక్షలు వసూలు చేసిన కిలాడీ లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. రేషన్ కార్డు కోసం ఖైరతాబాద్ సివిల్ సప్లై ఆఫీసుకు వెళ్లిన సదరు మహిళ.. అక్కడ పనిచేసే ఎల్డీసీ ఉద్యోగితో పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత ఓయో రూమ్ రసీదులు, ఫోటోలతో బ్లాక్‌మెయిలింగ్‌కు దిగింది. బాధితుడి తల్లి ఫిర్యాదుతో రంగంలోకి

..మిగతా 4వ పేజీలో →



## జలమండలిలో అవినీతి తిమింగలం

### జలమండలి జీఎం కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు..

### కుప్పలుగా నోట్ల కట్టలు, 100 కోట్ల ఆస్తులు గుర్తింపు !

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ ఫోకస్ చేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారి లక్ష్యంగా యాంటీ కరప్షన్ బ్యూరో (అధికారులు దాడులు చేపట్టారు. రెడ్ హిల్స్ జలమండలి జనరల్ మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక దాడులు

..మిగతా 4వ పేజీలో →

### 28 నుంచి భూముల ధరలు

## భారీగా పెరుగుదల

### మూడు రకాలుగా సాగు భూముల విలువ సవరణ

### ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం

**దశ, హైదరాబాద్:** తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ

..మిగతా 4వ పేజీలో →





## హైదరాబాద్ లోని మణికొండలో ఘోరం

### మహిళలను చీరలెత్తి చూస్తున్న చైన్ స్నాచర్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న మణికొండ, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పట్టపగలే, జనసంచారం ఉన్న ప్రాంతంలో ఒక మహిళ పట్ల జరిగిన ఈ అసభ్య ప్రవర్తన మహిళా భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తుతోంది. మణికొండ, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో అత్యంత వికృతమైన ఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల గురించి వినే ప్రజలకు, ఇప్పుడు వీధుల్లో మహిళల పట్ల

..మిగతా 4వ పేజీలో →




### 44 ఏళ్ల వరకు

## ఉద్యోగాలకు అర్హత

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షల మంది నిరుద్యోగులకు రేవంత్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్‌ల్లో ప్రత్యక్ష నియామకాల కోసం నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని మరో 10 ఏళ్లపాటు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు జీవో జీవో నెంబర్ 86 నుంచి విడుదల చేశారు. ఈ నిర్ణయంతో ఇప్పటి వరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ట వయోపరిమితి ఇప్పుడు 44 ఏళ్లకు చేరుకుంది. ఈ పెంపు కేవలం ఒక ఏడాదిపాటు అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ఓసీ అభ్యర్థులు 44 ఏళ్ల వరకు ప్రభుత్వ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. మిగతా కేటగిరిల రిజర్వేషన్ బట్టి వారి వయోపరిమితి పెరుగుతుంది.

### లులూ హైపర్ మార్కెట్‌లో

## పురుగుల పిండి, కుళ్లిన కూరగాయలు!




తనిఖీలు చేపట్టిన అధికారులు..

విశ్లేషణకు ల్యాబొరేటరీకి

పాడైన దాదాపు 150 కిలోల ఆహార ఉత్పత్తుల స్వాధీనం

4లో




### ట్రాన్స్ ఫర్ చేసిన

## అరగంటలోనే రివర్స్..

### సైబరాబాద్ కమిషనరేట్ లో ఏం జరుగుతోంది

### పరిపాలనాపరమైన సమన్వయ లోపమా.. లేక అంతర్గత ఒత్తిళ్లా..?

**దశ, హైదరాబాద్:** శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన, ప్రతిష్టాత్మకమైన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఇప్పుడు బదిలీల గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. పరిపాలనాపరమైన సమన్వయ లోపమో, లేక అంతర్గత ఒత్తిళ్లకు తలొగ్గడమో తెలియదు కానీ, ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు

..మిగతా 4వ పేజీలో →



## ఉద్యోగిని వలలో వేసుకుని
# హనీట్రాప్

**మొదటి పేజీ తరువాయి**

దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ పంజాగుట్ట పరిధిలో రేషన్ కార్డు కోసం వచ్చిన ఒక మహిళ.. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగిని హనీట్రాప్ వేసి లక్షలాది రూపాయలు వసూలు చేసింది. ఖైరతాబాద్ సివిల్ సప్లయ్ ఆఫీసు వేదికగా సాగిన ఈ బ్లాక్‌మెయిలింగ్ వ్యవహారం బాధితుడి తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రహమత్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళ (40) తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలోనే 2022 జూన్ నెలలో కొత్త రేషన్ కార్డు కోసం ఆమె ఖైరతాబాద్‌లోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. కార్డు మంజూరు ప్రక్రియ కోసం తరచూ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న క్రమంలో అక్కడ లోయర్ డివిజన్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది.ఈ పరిచయం కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. వీరిద్దరి వ్యవహారం కాస్తా ముదరడంతో తరచూ ఓయో రూమ్‌లకు వెళ్లడం, అలాగే సదరు ప్రభుత్వ ఉద్యోగి ఆమె నివాసానికి రావడం వంటివి సాగాయి. అయితే ఇదంతా తనను లూటీ చేయడానికి మహిళ పన్నిన వ్యూహంలో భాగమేనని బాధితుడు ఊహించలేకపోయాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె సదరు ఉద్యోగి నుంచి విడతల వారీగా డబ్బులు డిమాండ్ చేయటం ప్రారంభించింది. మొదట్లో చిన్న మొత్తంలో రూ.5 వేలతో మొదలైన డిమాండ్లు.. ఆ తర్వాత లక్షల్లోకి చేరాయి. ఒకానొక దశలో బాధితుడిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. తమ ఇద్దరి వ్యక్తిగత ఫోటోలను, వారు కలిసి వెళ్లిన ఓయో రూమ్ రసీదులను పోలీసులకు, ఉన్నతాధికారులకు చూపిస్తానంటూ ఆమె నిరంతరం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడింది. అవమాన భారంతో సదరు ఉద్యోగి ఆమె అడిగినప్పుడల్లా డబ్బులు ఇచ్చుకుంటూ రాగా.. ఇప్పటి వరకు దాదాపు రూ.6 లక్షల వరకు కిలాడీ లేడి స్వాహా చేసింది. ఇటీవల కాలంలో ప్రవర్తనలో మార్పు రావడం, ఆఫీస్ విషయాల్లో తీవ్ర ఆందోళన చెందడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటాన్ని అతని తల్లి గమనించారు. కొడుకును గట్టిగా నిలదీయడంతో లేడీ చేతిలో తను చిక్కుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు గురవుతున్న దారుణమైన నిజాన్ని తల్లికి వివరించాడు. తన కొడుకు జీవితాన్ని నాశనం చేస్తున్న మహిళ బాగోతాన్ని బయటపెట్టేందుకు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పంజాగుట్ట పోలీసులు విచారణలో నిజమే అని తేలటంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## 28 నుంచి భూముల ధరలు
# భారీగా పెరుగుదల

**మొదటి పేజీ తరువాయి**

పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది.ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం



చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు.



## జలమండలిలో
# అవినీతి తిమింగలం

**మొదటి పేజీ తరువాయి**

చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 విభిన్న ప్రాంతాలలో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. మల్లాపూర్‌లోని జీఎం కుమార్ స్వగృహంలో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ స్వయంగా రంగంలోకి దిగి ఈ తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.జలమండలి జీఎం కుమార్ నివాసంతో పాటు ఆయనకు అత్యంత సమీప బంధువుల ఇళ్లలోనూ సోదాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తనిఖీల్లో అధికారులకు భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఇంట్లో కుప్పలుగా పడి ఉన్న నోట్ల కట్టలను చూసి ఏసీబీ అధికారులే ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.స్వాధీనం చేసుకున్న నగదు అత్యధికంగా ఉండటంతో, దానిని ఖచ్చితంగా లెక్కించేందుకు అధికారులు ప్రత్యేకంగా క్యాష్ కౌంటింగ్ మెషీన్లను తెప్పించారు. జలమండలి మేనేజర్ అనంత లక్ష్మి కుమార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు తనికీల్లో 100 కోట్ల ( మార్కెట్ విలువ ప్రకారం ) ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మల్లాపూర్ తో పాటు బంధువుల నివాసాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఇంట్లో కోటి 10 లక్షల నగదుతో పాటు సుమారు 1 KG బంగారు ఆభరణాలు గుర్తించారు. లభ్యమైన డాక్యుమెంట్స్ ప్రకారం హైదరాబాద్ లో గేటెడ్ కమ్యూనిటిలలో 3 ఫ్లాట్స్.. 6 ఓపెన్ ఫ్లాట్స్ ఉన్నాయి. నిజామాబాద్ లో 3 ఎకరాల భూమి ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉన్నాయని ఏసీబీ అధికారులు గుర్తించారు. బ్యాంక్ లాకర్స్ ఓపెన్ చేసి అందులో ఏముందో చెక్ చేయనున్నారు. పట్టుబడిన ఈ భారీ నగదు, ఇతర ఆస్తుల వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లపై దర్యాప్తు బృందం ప్రస్తుతం ఆరా తీస్తోంది. ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు, లభించిన మొత్తం ఆస్తుల విలువ ఎంత అనేది సోదాలు ముగిసిన అనంతరం అధికారులు అధికారికంగా వెల్లడించనున్నారు. జీఎం కుమార్ స్థిర, చరాస్తుల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై 'మల్కాజ్‌గిరి' పోలీసుల ఉక్కుపాదం!

*** ఒక్కరోజే 1,340 కేసులు నమోదు..**
**రూ.13.39 లక్షల జరిమానా విధింపు**

*** నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:**
**పోలీస్ కమిషనర్ బి. సుమతి హెచ్చరిక**

**దశ, మల్కాజ్‌గిరి** :వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడే బేఖాతరు డ్రైవర్లపై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రహదారి భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమిషనరేట్ వ్యాప్తంగా మంగళవారం ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, IPS ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ జోన్I, జోన్II పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. డిసిపి (ట్రాఫిక్-I), డిసిపి (ట్రాఫిక్-II)ల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ నిఘా చర్యల్లో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, కారిడార్లు, సిగ్నల్ పాయింట్లు, రద్దీగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను మోహరించి నిబంధనలు ఉల్లంఘించిన వారిని పట్టుకున్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్ వాడుతూ వాహనాలు నడిపిన వారిపై మొత్తం 1,340 కేసులు నమోదు చేశారు. నిందితులకు రూ. 13,39,000/ (పదమూడు లక్షల ముప్పై తొమ్మిది వేల రూపాయలు) జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు పంపడం (టెక్స్టి ంగ్), ఇంటర్నెట్ బ్రౌజింగ్, వీడియో రికార్డింగ్ చేయడం, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆపరేట్ చేయడం లాంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన

**మొదటి పేజీ తరువాయి**

సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ
# ఆవిర్భావ దినోత్సవం..

**మొదటి పేజీ తరువాయి**

గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## హైదరాబాద్ లోని
# మణికొండలో ఘోరం

**మొదటి పేజీ తరువాయి**

జరుగుతున్న అసభ్య ప్రవర్తన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు నంబర్ 4లోని ప్రణతి ఈషా అపార్ట్‌మెంట్ సమీపంలో.. తన చిన్నారితో కలిసి స్కూల్ నుండి ఇంటికి తిరిగి వస్తున్న ఒక మహిళపై ఒక టీనేజ్ బాలుడు అత్యంత నీచంగా ప్రవర్తించాడు. వెనుక నుంచి వచ్చి ఆమె దుస్తులను ఎత్తి వికృత చేష్టలకు పాల్పడి, అక్కడి నుంచి పారిపోయాడు.ఈ మొత్తం ఉదంతం అక్కడ ఉన్న సిసిటివి కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యింది. పట్టపగలు, అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘటన చూస్తుంటే.. నేరస్థులకు చట్టం అన్నా, పోలీసులన్నా ఎంత చులకన భావం ఉందో అర్థమవుతోంది. కేవలం అల్లరి పనిలా కాకుండా, ఇది ఒక మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమైన వేధింపుగా స్థానికులు పరిగణిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలతో వెళ్తున్న తల్లులను ఇలాంటి మానసిక రోగులు లక్ష్యంగా చేసుకోవడం భయాందోళనలకు గురిచేస్తోంది.

# మద్యం తాగించి స్టూడెంట్ పై రేప్

**మొదటి పేజీ తరువాయి**

తేదీన రాత్రి తన క్లాస్‌మేట్ అయిన ఒక యువతిని టీ తాగడానికి వస్తావా అని పిలిచి, తన కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు తీసుకెళ్లాడు. అనంతరం వారు కారులో ఇబ్రహీంపట్నం తిరిగి వస్తున్న సమయంలో ఉదయ్ మద్యం కొనుగోలు చేశాడు. తన ప్లాన్ ప్రకారం బీడీఎల్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి కారును తీసుకెళ్లి, అక్కడ విద్యార్థినికి బలవంతంగా మద్యం తాగించాడు. ఆమె మత్తులోకి వెళ్లాక, ఇబ్రహీంపట్నంలోని ఒక గదికి కారులో తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై మే 17న బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు ఉడుతల ఉదయ్‌ను సోమవారం నాడు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

## ట్రాన్స్ ఫర్ చేసిన
# అరగంటలోనే రివర్స్..

**మొదటి పేజీ తరువాయి**

పోలీస్ శాఖలోనే తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగితాలపై బదిలీల ఫైళ్లు పరుగులు పెడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్టేషన్లు వెలవెలబోతున్నాయి. ఫలితంగా సిబ్బంది కొరతతో ఐటీ కారిడార్లో పోలీసింగ్ వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది.మే 2న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒకేసారి 65 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి భారీ బదిలీల వెనుక వారం రోజుల పాటు తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతుంది. కానీ, ఏమైందో ఏమో తెలీదు కానీ.. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే ఆ ఆర్డర్లను నిలిపివేస్తూ (హోల్డ్లో పెడుతూ) మరో ఆదేశం రావడం డిపార్ట్మెంట్లో కలకలం రేపింది. ఆర్డర్ వచ్చింది.. సీట్ మారుతుందనుకునే లోపే బ్రేక్ పడింది' అంటూ ఇన్స్పెక్టర్లు సైతం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ వెనకడుగు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అంతర్గత వ్యూహాత్మక లోపాలు ఉన్నాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది.ఇన్స్పెక్టర్ల బదిలీల వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే.. కమిషనరేట్ పరిధిలోని 32 మంది సబ్‌ఇన్స్పెక్టర్లను (ఎస్‌ఐలను) జోన్6 చార్మినార్కు సరెండర్ చేస్తూ హుటాహుటిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పైగా, ఆర్డర్లు వచ్చిన వెంటనే వారందరినీ రిలీవ్ చేయడంతో వారంతా కొత్త ప్రాంతాల్లో రిపోర్ట్ చేయడానికి వెళ్ళిపోయారు. దీనికి బదులుగా హైదరాబాద్ సిటీ నుంచి మరో 32 మంది ఎస్‌ఐలను సైబరాబాద్కు కేటాయించాలనే ప్రతిపాదనలు అయితే సిద్ధం చేశారు కానీ, వారు క్షేత్రస్థాయిలో విధుల్లో చేరడానికి ఇంకా ముహూర్తం కుదరలేదు. వెళ్ళిన వారు వెళ్ళిపోయారు.. రావాల్సిన వారు రాలేదు. మధ్యలో స్టేషన్లలో ఉన్న సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనివల్ల మిగిలిన సిబ్బందిపై పనిభారం రెట్టింపు అయ్యింది.గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్కు గుండెకాయ లాంటి ఐటీ కారిడార్ పరిధిలోని పోలీస్ స్టేషన్లపై ఈ బదిలీల ప్రభావం తీవ్రంగా పడింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి, కూకట్పల్లి, బాచుపల్లి. అంతర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీలు, లక్షలాది మంది ఉద్యోగుల రాకపోకలు, నిత్యం ట్రాఫిక్ జాంలు, వీఐపీల బందోబస్తులు, హైప్రొఫైల్ నేరాలు. ఇలాంటి అత్యంత సున్నితమైన, బిజీ స్టేషన్లలో ఎస్‌ఐల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణ,క్రైమ్ ఇన్వెస్టిగేషన్, రాత్రి పూట పెట్రోలింగ్, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ వంటి బాధ్యతలను కొద్దిమంది సిబ్బందే అదనపు షిఫ్టులు చేస్తూ నిర్వహించాల్సి వస్తోంది. సుదీర్ఘ గంటల పనివల్ల క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గందరగోళానికి గురైన బదిలీల ప్రక్రియను క్రమబద్ధీకరించి, ఐటీ కారిడార్ స్టేషన్లకు తక్షణమే పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## లులూ హైపర్ మార్కెట్‌లో
# పురుగుల పిండి, కుళ్లిన కూరగాయలు!

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ప్రముఖ షాపింగ్ కేంద్రమైన లులూ హైపర్‌మార్కెట్‌లో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనలకు సంబంధించి తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. స్టోర్‌లోని వివిధ విభాగాల నుంచి పాడైన దాదాపు 150 కిలోల ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఫుడ్ సేఫ్టీ కమిషనర్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా అధికారులు హైపర్‌మార్కెట్‌లోని ఇన్‌హౌస్ కిచెన్, రిటైల్ విభాగం, మాంసం విక్రయశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత అత్యంత దారుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన ఆహారాన్ని కనుగొని, వెంటనే దాన్ని పారవేయించారు. అంతేగాక ప్రాంగణంలో పురుగులు, కుళ్లిన కూరగాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడువు తీరడానికి దగ్గరలో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై చిరిగిన, తప్పుదోవ పట్టించే లేబుల్స్ ఉన్నట్లు కనుగొన్నారు.రిటైల్ విభాగంలోనూ పలు ఉల్లంఘనలు వెలుగుచూశాయి. శనగపిండి, గోధుమపిండి, పప్పులు వంటివాటిలో పురుగులు పట్టి ఉండటాన్ని అధికారులు గమనించారు. కొన్ని ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను గుర్తించారు. అనేక ఉత్పత్తులపై పోషక విలువల సమాచారం, తయారీదారుడి చిరునామా, సరైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్ వంటి తప్పనిసరి వివరాలు లేకపోవడం గమనార్హం.మాంసం విక్రయించే బుచరింగ్ విభాగంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మాంసం వ్యర్థాలతో డ్రైనేజీలు మూసుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు.ఈ తనిఖీ అనంతరం పురుగులు పట్టిన స్వీట్లు, వంట నూనెలు, పిండి, పప్పులతో సహా సుమారు 150 కిలోల ఆహార ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, కృత్రిమ రంగుల వాడకం, పురుగుల కాలుష్యం వంటి అనుమానాలతో పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, తదుపరి విశ్లేషణ కోసం ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com